
# సినీ బేతాళ కథలు





- డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 38 -

### - ఇతిహాస్యాస్పదం -

**విక్రమార్కుడు** మళ్లీ బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు.

'విక్రా! నీకు శ్రమ అనిపించకుండా వుండేందుకు యీసారి నీ వాకులో నేనో కథ టాకుతాను. విను' - అని బేతాళుడు ప్రారంభించాడు.

"తెలుగు సినిమా, తెలుగు సినిమాతల్లి పాలు తాగి తెరలమీద తన తేజం పెంచుకుంటూ పెరుగుతోంది. తల్లిపాలిస్తుంటే, ప్రపంచ సినిమాని పరిపాలించే స్థాయికి పయనిస్తోంది.

నిర్మాతలైన వితండవాది, ప్రచండసోది తమ కొత్తచిత్రం కథ రెడీ చేసుకున్నారు. ఇంతవరకూ వొళ్లూ యిల్లూ గుల్లచేసుకుని యెన్ని చిత్రాలు తీసినా కనీసం కల్లు తాగడానికి కూడా చిల్లర మిగలడంలేదు. అంచేత ఫలితం యెలావున్నా, యిండస్ట్రీలో పనిచేసే పదిమంది కడుపులూ నింపడమే న్యాయం అనుకున్నారు. అందుకు అనుగుణంగా కథ యెన్నుకున్నారు. కథలో అందరికీ అవకాశం వుండాలి. ఫైట్ మాస్టర్ల ఫైటర్స్ కోసం ఫైట్స్ వుండాలి. డాన్సింగ్ గ్రూప్స్ కోసం డ్రిల్లు గంతులుండాలి. ఈ రెండు గ్రూపులకీ అవకాశం లేని కథను షూట్ చైడం కష్టం. షూటింగ్ సాగనివ్వరు. అంచేత వారంతా వుండేలా మూసకథ వొండేస్తే మూలకథ మూలపడిపోయినా, యిండస్ట్రీ ఆకలితో అలమటించదు.

సరే, మహాభారత సంగ్రామాన్ని తెరకెక్కిద్దామని తేల్చేసుకున్నారు. వితండవాది, ప్రచండసోది అను వాసో బ్రదర్స్.

షూటింగ్ మొదలెట్టారు. ఒక మైదానంలో వొకవైపు కౌరవసేన, మరోవేపు పాండవసేన. రెండు ఫైటర్స్ గ్రూప్సనీ చెరోవేపూ సర్దేశారు.

పగలు ఫైట్ సీన్లు అయిపోయాక, రాత్రులు సైనికుల హుషారు కోసం డాన్సు గ్రూపుల సాయంతో రెండు ఐటమ్ సాంగ్స్ యిమిడ్చారు.

మహాభారతంలో, కురుక్షేత్ర సంగ్రామంలో ఐటమ్ సాంగ్స్ అమర్చడం ఔచిత్యం కాదేమోనండి అన్నాడు రైటరు. ట్రెండుకి తగ్గట్టు, బెండవ్వాలయ్యా అని వితండవాది ఐటమ్ సాంగ్స్ లేకపోతే నా సాని జీవితం దెబ్బ తింటుంది అని ప్రచండసోది, రైటర్‌ని టెంకి జెల్ల కొట్టి పంపించేశాడు.

అవాళ అర్జునుడు, ద్రోణాచార్యుల వారిని సంహరించే సన్నివేశం.

అర్జునుడు హీరో - షైనింగ్ స్టార్ మషాలాబాబు. స్ఫురద్రూపి. ద్రోణుడు సీనియర్ సింగయ్య - సురద్రూపి - సూర్యాస్తమయందాకా మందు మీద వుంటాడు. సూర్యాస్తమయం తర్వాత మందులో వుంటాడు.

మషాలా బాబు రథంలో సారధి క్రిష్ణపాత్రధారి బాణాల సంచీ రెడీ చేశాడు.

ద్రోణుడు తన రథంలో దుర్యోధనుడిచ్చిన రకరకాల బ్రాండ్స్‌లో మందు ఘటాలను సర్దుకున్నాడు. వాటిలో తనకు ప్రాణాతి ప్రియమైన పుత్రుడు అశ్వద్ధామ బ్రాండ్ కూడా వుంది.

యుద్ధం ఆరంభమైంది.

అర్జునుడి వేషంలో మషాలాబాబు ద్రోణాచార్యుడు సింగయ్య మీదికి బాణాలు వేస్తున్నాడు. సింగయ్య బాణానికో సిప్పు కొడుతూ ప్రతిబాణాలు వేస్తున్నాడు. గురువు బాణాలు శిష్యుడి బాణాల్ని చీల్చి ముక్కలు చేస్తున్నాయి.

కౌరవ పాండవుల గురువు, మహావిలువిద్యా నైపుణ్యుడైన ద్రోణ సింగయ్యను సంహరించడం అర్జున మషాలా శక్యమా? దీనికి తోడు ద్రోణుడు పెగ్గు పెగ్గుకీ నిగ్గుతేలి రణదిగ్గజుడైపోతున్నాడు.

ద్రోణ సంహారం గగనమైపోతోంది. ఇంతలో గగనం మేఘావృతం అయింది. చినుకులు మొదలయ్యాయి. మొదలైన చినుకులు వానధారలయ్యాయి. ఆ ధారలు, తను కష్టపడి రాసిన భారతాన్ని, నిర్మాతలు వితండవాది, ప్రచండసోది భరించలేని క్షమించరాని మార్పులతో ఖూనీ చేసి సినిమా తీస్తున్నందుకు మనసంతా కరిగిపోయి, శ్రీవేదవ్యాసుడు పై లోకం నుంచి శోకిస్తున్నట్టుగా కురుస్తున్నాయి.

'లైట్ పోతోంది, షూటింగ్ స్టాప్ చెయ్యక తప్పదు-' అన్నాడు కెమెరామన్.

'అర్జున ద్రోణుల యుద్ధం మన చిత్రానికి వైటల్ సీను. సాయంకాలందాకా చేద్దామనుకున్నాం. కానీ యీ వానతో లైట్ లేకుండా చెయ్యలేం. క్రికెట్ మ్యాచ్‌ని ఆపేసినట్టు ఆపెయ్యక తప్పదు. డక్‌వర్త - లూయిస్ మెథడ్ ఎడాప్ట్ చేసి ఏదో విధంగ ద్రోణసంహారం పూర్తిచేద్దాం -' అన్నాడు డైరెక్టర్.

మరి ద్రోణుడు పెగ్గుపెగ్గుకీ రెచ్చిపోతుంటే అర్జున మషాలా ఏం చెయ్యగలడు? -

- ఇదీ సంగతి విక్రా! ఇప్పుడు చెప్పు. అవాళ మహాభారత సంగ్రామం తెలుగు సినిమా షూటింగ్ సడెన్‌గా ఆగిపోతుంటే ద్రోణున్ని, అర్జునుడు చంపే సన్నివేశం తియ్యగలిగారా? గలిగితే యెలా గలిగారు? చిత్ర విజయానికి ఆయువుపట్టైన ఆ సన్నివేశాన్ని అర్ధాంతరంగా చుట్టేస్తే, రిలీజయాక సినిమాను ప్రేక్షకులు ఆదరించారా? ఈ ప్రశ్నలకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావో, నీతల భారతం తెలుగు సినిమా స్క్రీన్‌ప్లేలా వెయ్యి వొంకర్లు తిరిగి నువ్వు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవలసి వస్తుంది -'' అని ముగించాడు బేతాళుడు.

బదులుగా విక్రమార్కుడు - ''ఓ! బేతాళా! అప్పుడప్పుడు అనివార్యకారణాలవల్ల షూటింగ్స్ మధ్యలో క్రికెట్ మేచెస్‌లా ఆగిపోవడం పరిపాటే. షూటింగ్ ప్యాకప్‌కి ముందు - అర్జంటుగా శ్రీకృష్ణుడు ధర్మరాజు చేత అసత్యాన్ని నిజంలా పలికించాడు. ఈ తెలుగు సినిమా షూటింగ్‌లో ధర్మరాజు 'అశ్వద్ధామ ఫినిష్డ్' అన్నాడు. ఆ మాట వినగానే హతాశుడై ద్రోణ సింగయ్య నేలకూలాడు. ఇందులో ధర్మరాజు పాత్ర అబద్ధం చెప్పి ధర్మజుడి ఔచిత్యం భంగపరచలేదు. ఎందుకంటే దుర్యోధనుడు ద్రోణుడి రథంలో పెట్టిన మందు ఘటాల్లో 'అశ్వద్ధామ' బ్రాండ్ కూడా వుందని మనకి తెలుసు. పెగ్గి మీద పెగ్గు పీకుతూ ద్రోణసింగయ్య 'అశ్వద్ధామ బ్రాండ్

మందు కూడా జుర్రేశాడు. ద్రోణుడు సుర్రద్రూపి అని నువ్వేకదా చెప్పావు - అశ్వద్ధామ 'బ్రాండ్ అంతా ద్రోణుడు తాగేశాడు కనుక 'ధర్మరాజు' - అశ్వద్ధామ ఫినిష్డ్' అనడంతో అసత్యంలేదు. ఆ సీను హడావుడిగా తీసినా వేదవ్యాసుడు వర్షాతిశయంతో విలపించినా - సినిమా సక్సెస్ అయింది. ప్రేక్షకులు ఆదరించారు. కల్తీఫుడ్ తిని జనం బతకడంలేదూ.

ఇలాగే స్టీవెన్స్పీల్ బర్గ్ 'ఇండియానాజోన్స్' సినిమా చిత్రీకరిస్తున్నప్పుడు, హీరో హారిసన్ ఫోర్డ్‌తో రోజంతా మంచి కత్తియుద్ధం ప్లాన్ చేశాడు. కానీ అనుకోకుండా హారిసన్ ఫోర్డ్‌కి ఔట్‌డోర్ ఫుడ్ పడక విరేచనాలు పట్టుకున్నాయి. రోజంతా అనుకున్నట్టుగా ఫోర్డ్‌తో స్వోర్డ్ ఫైట్ తీయటం కుదరదు. అంచేత స్పీల్‌బర్గ్, హీరో ఫోర్డ్ చేత ఒక్క గన్‌షాట్‌తో శత్రువుని ఫినిష్ చేయించాడు. ఆ సీను పెద్ద హిట్టయ్యి, ఆ చిత్రం గొప్ప సక్సెస్ అయ్యింది.

యం హినవ్యధయం త్యేతే
పురుషం పురుషర్షభ!
సమదుఃఖసుఖంధీరం
సో అమృతత్వాయ కల్పతే ||

- ప్రకృతిలో అనుకూల ప్రతికూలాలు అలవాటే. తాత్కాలిక సుఖదుఃఖాలను ధైర్యంగా యెదుర్కొను 'సమబుద్ధి'తో సహనబుద్ధి'తో చేయు నిర్మాత మానవుడుగా 'అమృతత్వము' అనగా సక్సెస్‌ను పొందుము - అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణభగవానుడు -" అని చెప్పగానే రాజుకి మౌనభంగం కలిగి, బేతాళుడు యెగిరి వెళ్లి చెట్టెక్కేసి 'అశ్వద్ధామ' బ్రాండ్ యే పిచ్చికొమ్మకైనా కాసిందేమోనని వెదుక్కున్నాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments